క్లుప్తంగా

ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ దుర్మార్గం



మాట్లాడుతున్న సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ దుర్మార్గం అని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. శనివారం ఆమె మండలంలోని సంజీవరాయునిపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే మిథున్ రెడ్డిని అరెస్ట్ చేశారని.. ఇది కూటమి ప్రభుత్వ కుట్ర అని దుయ్యబట్టారు. తప్పుడు వాంగ్మూలాలను సృష్టించి కేసులు బనాయించి అరెస్ట్ చేసి కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే ఆయన బయటకు వస్తారని కార్యకర్తలెవ్వరూ అధైర్యపడొద్దని తెలిపారు. సమయం వచ్చినప్పుడు చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ చరిత్రలు బయట పెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, పబ్లిసిటి వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి, దామోదర్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, గిరీష్ రెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి వీడ్కోలు

రొద్దం: ఉపాధ్యాయురాలు వరలక్ష్మి సేవలు మరువలేనివని పలువురు గ్రామస్తులు అన్నారు. మండల పరిధిలోని గోనిమేకుపలపల్లి ప్రాథమిక పాఠశాలలో గత తొమ్మిదేళ్లుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు వరలక్ష్మిని శనివారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిందని కొనియాడారు. పాఠశాలలో చదువుతున్న పిల్లలను తన సొంత పిల్లలా చూసుకున్నారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భారతి, గ్రామ పెద్దలు వెంకటరారెడ్డి, స్కూల్ చైర్మన్ మనోహర్ పాల్గొన్నారు.

జాబ్‌మేళా

మడకశిరరూరల్: నీలకంఠాపురం గ్రామంలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ పోస్టులకు 30 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు అడ్మినిస్ట్రేటర్లు దివ్య, రఫీక్ భాషా తెలిపారు. ఎంపికైన వారికి త్వరలో హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగాలు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి పాల్గొన్నారు.

ఏఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

రొళ్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో నూతన ఏఎస్‌ఐగా హిదాయతుల్లా శనివారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎస్‌ఐ వీరాంజనేయులు తెలిపారు. ప్రస్తుతం ఏఎస్‌ఐగా పని చేస్తున్న బాలాజీ బదిలీ అయ్యారు. హిదాయతుల్లా హిందూపురం నుంచి రొళ్ల స్టేషన్‌కు బదిలీపై వచ్చారు.

బహిరంగ సభ స్థల పరిశీలన

మడకశిర: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం మడకశిర నియోజకవర్గంలో పర్యటించనున్నారు. శనివారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజుతో పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో జరగనున్న బహిరంగ సభ నిర్వహణ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీఐలు రాజ్‌కుమార్, నగేష్‌బాబు పాల్గొన్నారు.

21న డిగ్రీ అడ్మిషన్లు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరం బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈనెల 21 ఉదయం 10 గంటలకు కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులు ఇంటర్ మార్కుల మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో రావాల్సి ఉంటుందన్నారు. దూరప్రాంతపు విద్యార్థినులకు హాస్టల్ సదుపాయం కూడా ఉందని పేర్కొన్నారు.

ఆర్డీటీ సేవలు కొనసాగించాలి



ఆర్డీటీకి మద్దతుగా నినాదాలు చేస్తున్న విద్యార్థులు

రొళ్ల: నిరుపేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఆర్డీటీ సేవలను కొనసాగించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఆర్డీటీ సిబ్బందితో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం వైఎస్సార్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1969లో ఆర్డీటీ ఏర్పాటైనప్పటి నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేలాది నిరుపేద కుటుంబాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. సంస్థపై కక్షగట్టి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఆర్డీటీ సేవలు కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏటీఎల్ ఓబులేష్ పాల్గొన్నారు.

విత్తుకోని ఆశలు

- కరుణించని వరుణుడు
- ఈ ఏడాది తీవ్ర వర్షాభావం
- తగ్గిపోయిన వేరుశనగ సాగు
- నియోజకవర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం 23,973 హెక్టార్లు
- ప్రస్తుతం సాగైన విస్తీర్ణం 4,945 హెక్టార్లు
- ఆందోళనలో అన్నదాతలు



మడకశిర సమీపంలో భూమిని బీడుగా వదిలేసిన దృశ్యం

మడకశిర: వరుణుడు కరుణించక పోవడంతో ఈ ఏడాది వేరుశగన సాగు గణనీయంగా తగ్గిపోయింది. నియోజకవర్గంలో ఈ ఏడాది 4,945 హెక్టార్లలోనే రైతులు వేరుశనగ పంటను సాగు చేశారు. 5 మండలాల పరిధిలో సాధారణ వేరుశనగ సాగు విస్తీర్ణం 23,973 హెక్టార్లుగా వ్యవసాయశాఖ నిర్ణయించింది. అయితే ఈ విస్తీర్ణంలో 25 శాతం కూడా పంటలు సాగుకు నోచుకోలేదు. అగళి మండలంలో పంటల సాగు విస్తీర్ణం పూర్తిగా పడిపోయింది. ఈ మండలంలో 2,533 హెక్టార్లకు గాను కేవలం 212 హెక్టార్లలో మాత్రమే రైతులు పంట సాగు చేయడం గమనార్హం. మిగిలిన మండలాల్లో కూడా సాధారణ సాగు విస్తీర్ణం కంటే తక్కువగానే పంట సాగైంది. కాగా.. అన్ని మండలాల్లో కూడా వేరుశనగ సాగు పూర్తిగా తగ్గిపోయింది. వేరుశనగ సాగుకు జూన్ 15 నుంచి జూలై 15 వరకు మంచి అదునుగా రైతులు భావిస్తారు. అయితే ఈ అదునులోనే వర్షాలు కురవలేదు. కనీసం సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. దీంతో పంటల సాగుకు రైతులకు అవకాశం లేకుండా పోయింది. విత్తడానికి విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్న రైతులకు నిరాశే ఎదురైంది. ప్రస్తుతం వర్షం కురిసినా వేరుశనగ పంట సాగుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. గడువు మీరిన తర్వాత పంట సాగు చేస్తే ఎలాంటి ఉపయోగం ఉండదని భావిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు పంట సాగు చేసుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నా వెనకడుగు వేస్తున్నారు. రైతుల లెక్కల ప్రకారం జూలై 15 వరకు పంట సాగుకు అనుకూలమైన సమయం. దీంతో రైతులు వేరుశనగ పంట సాగుపై ఆశలు వదులుకున్నారు.

2025 ఖరీఫ్‌లో వేరుశనగ సాగు ఇలా..

మండలం	సాధారణ సాగు (హెక్టార్లలో)	సాగైన విస్తీర్ణం (హెక్టార్లలో)
మడకశిర	5,236	195
అమరాపురం	6,686	1,220
గుడిబండ	5,141	1,526
రొళ్ల	4,377	1,792
అగళి	2,533	212
మొత్తం	23,973	4,945

ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు

వేరుశనగ సాగుకు గడువు మీరడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. చాలా మంది రైతులు విత్తడానికి సిద్ధం చేసుకున్న విత్తనాలను అమ్ముకుంటున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సరఫరా చేయాలని కోరుతున్నారు. ముఖ్యంగా ఉలవలు, జొన్న, కంది, ఆముదం, అలసంద తదితర విత్తనాలను ప్రభుత్వం అందించాల్సిన అవసరం ఉంది. వంద శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ప్రభుత్వం సకాలంలో అందిస్తే బాగుంటుందని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సకాలంలో రైతులకు అందిస్తుందో లేదో వేచి చూడాల్సిందే.

ప్రత్యామ్నాయ పంటలు వేయండి



వేరుశనగ పంటను ఈనెలాఖరు వరకు సాగు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఆ తర్వాత పంట సాగు చేసినా ప్రయోజనం ఉండదు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆశించిన స్థాయిలో పంట సాగు కాలేదు. సమయానికి వర్షం రాకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. వేరుశనగ పంట సాగు చేయని రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి. రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సబ్సిడీతో అందించడానికి చర్యలు తీసుకుంటాం.

– కృష్ణమీనన్, ఇన్‌చార్జ్ ఏడీఏ, మడకశిర

వర్షాలు కురవలేదు



ఈ ఏడాది అనుకున్న సయయానికి వర్షాలు కురవలేదు. దీంతో వేరుశనగ పంట సాగు చేయలేకపోయాను. వేరుశనగ సాగుకు వర్షం కోసం ఎదురు చేసినా ఫలితం లేదు. ప్రస్తుతం వేరుశనగ సాగుకు గడువు తీరిపోయింది. ఇప్పుడు వర్షం వచ్చినా వేరుశనగ పంట సాగు చేస్తే దిగుబడి ఉండదు. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి. ఉచితంగా ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు పంపిణీ చేయాలి.

– ఈశ్వరప్ప, అమరాపురం

వేరుశనగ సాగు చేయలేం



ప్రస్తుతం వర్షం వచ్చినా వేరుశనగ పంట సాగు చేయలేం. ఈనెల 15 వరకే వేరుశనగ పంట సాగు చేయడానికి మంచి సమయం. ఈ గడువు కూడా ముగియడంతో వేరుశనగ పంట సాగుపై ఆశలు వదులుకున్నాం. ఒకవేళ సాగు చేస్తే నష్టాలు చూడాల్సి వస్తుంది. ఇక ప్రత్యామ్నాయ పంటల సాగే రైతులకు శరణ్యం.

– నాగరాజు, రైతు, అగళి

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

లేపాక్షి: మండల కేంద్రంలోని చేతన ఫంక్షన్ హాలో ఆదివారం ఉదయం 11 గంటలకు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ నిస్సార్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, పార్టీ పరిశీలకుడు రమేష్ రెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, నాయకులు కార్యకర్తలు హాజరుకావాలని పేర్కొన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమం

పెనుకొండ రూరల్: మండలంలోని నాగలూరు, మావటూరు, అడదాకులపల్లి గ్రామాల్లో ఆదివారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహ, సుధాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నాగలూరులో, 11 గంటలకు మావటూరులో, 12 గంటలకు అడదాకులపల్లిలో కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు, పార్టీ కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

పరామర్శ

రొళ్ల: సోమఘట్ట గ్రామానికి చెందిన తిమ్మరాజు అనారోగ్యంతో రొళ్ల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాడు. శనివారం విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్గనైజేషన్ యాక్టివిటీ సెక్రటరీ వజ్రభాస్కర్ రెడ్డి తదితరులు పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, రాష్ట్ర మహిళ విభాగం కార్యదర్శి సాయిలీల, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, సీనియర్ నాయకులు రంగనపల్లి నాగేంద్ర, నగేష్‌రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడదాం



అగళి: బాబూ ష్యూరిటీ- మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు



రొళ్ల: కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప, చిత్రంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అగళి: వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన నిలిచి నిరంతరం పోరాటం చేస్తుందని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్గనైజేషన్ యాక్టివిటీ సెక్రటరీ వజ్ర భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం పార్టీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ అధ్యక్షతన మండల కేంద్రంలోని శంకేశ్వర దేవాలయ ఆవరణలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీపై నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో అనేక హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. తూతూ మంత్రంగా తల్లికి వందనం పథకం అమలు చేశారన్నారు. చాలా మంది అర్హులకు ఈ పథకం వర్తింపజేయలేదన్నారు. రైతులు, విద్యార్థులు, తల్లులు, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వజ్ర భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించేందుకు ఇంటింటికీ వెళ్లాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రైతులకు ఇప్పటి వరకు పైసా సాయం అందలేదన్నారు. కనీసం పండించిన పంటలకు గిట్టుబాటు ధర కూడా కల్పించలేదని మండిపడ్డారు. అనంతరం మండల పరిధిలోని ఆర్‌జీ పల్లిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నర్సేగౌడ్, జెడ్పీటీసీలు అనంతరాజు, భూతరాజు, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సాయిలీల, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్ రెడ్డి, రాష్ట్ర కుంచిటి వక్కలిగ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, సర్పంచులు శివకుమార్, ముద్దరాజు, రామకృష్ణప్ప, కృష్ణప్ప, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జయకుమార్, నాయకులు అశ్వత్ నారాయణ, సతీష్, జయరామప్ప, సదానంద ఆరాధ్య, సుర్యానారాయణ రెడ్డి, దేవన్న, ఈరన్న, లింగరాజు, కృష్ణ, శివన్న, మధు, వెంకటస్వామి, బోజేగౌడ్, తిమ్మరాయప్ప, నాగరాజు, హనుమంతరాయప్ప, హనుమంతరాజు, రాజన్న, మైలారప్ప, దినేష్, కామరాజు, మంజునాథ్, నాగేంద్ర, శివరాజు, గుజరప్ప, గోవిందప్ప, శీనప్ప, నారాయణ, సత్యప్ప, రాజప్ప, మంజునాథ, గిరీష్ పాల్గొన్నారు.

కూటమికి బుద్ధి చెబుదాం..

రొళ్ల: మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసగించిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుదామని సమన్వయకర్త ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్గనైజేషన్ యాక్టివిటీ సెక్రటరీ వజ్ర భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి కమ్యూనిటీ భవనంలో పార్టీ మండలాధ్యక్షుడు నరసింహారెడ్డి, దొడ్డేరి పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ అనిత, సీనియర్ నాయకుడు నాగేంద్ర అధ్యక్షతన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండ్‌కో ఆచరణకు సాధ్యం కాని 470 హామీలను ఇచ్చి ప్రజలను మోసగించారని విమర్శించారు. కూటమి పాలనలో కేవలం జన్మభూమి కమిటీ సభ్యులు మాత్రమే బాగుపడుతున్నారన్నారు. సామాన్య మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి రూ.2 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు లబ్ధి చేకూరినట్లు గుర్తు చేశారు. అనంతరం 14 నెలల కూటమి పాలనలో చేసిన మోసాలపై క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, రాష్ట్ర కుంచిటి వక్కలిగ అనుబంధ కమిటీ అధ్యక్షుడు రంగేడొడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, రాష్ట్ర మహిళ విభాగం కార్యదర్శి సాయిలీల, విజయ రంగేగౌడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నాగేంద్ర, నగేష్, రంగారెడ్డి, వైస్ కన్వీనర్ నగేష్ గౌడ, వైస్ ఎంపీపీలు రత్నమ్మ, నాగరాజు, గుడిబండ జెడ్పీటీసీ భూతరాజు, న్యాయవాది అశ్వత్థ నారాయణ, బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, తాలూకా బూత్ కమిటీ మేనేజర్ మల్లికార్జున్ గౌడు, జిల్లా కార్యదర్శి లోకేష్, రేకులకుంట హనుమంతరాయప్ప, మాజీ జెడ్పీటీసీ ఉగ్రప్ప, నాయకుడు గాలిదానే గౌడ, అంజలి సర్పంచులు, ఎంపీటీసీలు, మండల, తాలూకా, నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త టీఎన్ దీపిక, మధుమతి రెడ్డి

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక భరోసా ఇచ్చారు. హిందూపురం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ మోసాల్ని వివరించే క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డితో కలసి సమన్వయకర్త దీపిక మాట్లాడుతూ.. కూటమి నాయకులు రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్నారని తెలిపారు. మహిళలను కించపరచడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం, అక్రమ కేసులు పెట్టడం, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. రామరాజ్యాన్ని కాస్తా రావణ రాజ్యంలా మార్చేశారని దుయ్యబట్టారు. హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేద్దామని పిలుపునిచ్చారు. మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుమతిరెడ్డి మాట్లాడుతూ.. మాజీ మంత్రి రోజాపై నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేసిన అనుచిత వ్యాఖ్యలను యావత్ మహిళా లోకం ఖండిస్తోందన్నారు. మహిళలను కించపరుస్తూ మాట్లాడటం టీడీపీ నేతలకు అలవాటు అయిపోయిందన్నారు. వెంటనే ఎమ్మెల్యేను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సంతెబిదనూరు రాము, కురుబ వర్కింగ్ రాష్ట్ర అధ్యక్షుడు శివ, ఎంపీపీ రత్నమ్మ, జెడ్పీటీసీ నాగభూషణం, వైస్ ఎంపీపీ రఘునాథ రెడ్డి, రామాంజి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి, మాజీ మండల కన్వీనర్ శ్రీరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ కుమార్, తిప్పేరుద్రయ్య, గిరీష్ కుమార్, సర్పంచులు భాగ్యమ్మ, లలితమ్మ, ఆనంద్, శ్రీనివాసరెడ్డి, దేవరాజు, ఆదెప్ప, అశ్వర్థ రెడ్డి, నంజప్ప, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు కవితారెడ్డి, ఎంపీటీసీలు ధనుంజయ రెడ్డి, యాకాశప్ప, జగన్నాథ్ రెడ్డి, కృష్ణవేణి, కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మోహన్, మాజీ ఎంపీటీసీ మల్లేష్, కో-ఆప్షన్ సభ్యులు చాంద్‌బాషా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మడకశిర: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. కార్మికుల సమ్మెకు సీఐటీయూ, సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. మున్సిపల్ కార్మికులు బాలు, రామాంజనేయులు, గుడిబండప్ప, యల్లమ్మ, అన్నపూర్ణ, పార్వతమ్మ తదితరులు మాట్లాడారు. చాలా ఏళ్లుగా కార్మికులుగా పని చేస్తున్న తమను క్రమబద్ధీకరణ చేయలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులుగా పని చేస్తూ మృతి చెందిన కుటుంబాల్లో ఒకరికి వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించక పోతే అన్ని శానిటేషన్ పనులను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. నీటీ సరఫరా, వీధి దీపాలు సైతం నిలిపి వేస్తామని హెచ్చరించారు.

డబ్బు కాజేసిన వారిపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం టౌన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల డబ్బు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. 220 మందికి చెందిన రూ.13,32,743 సొమ్మును కార్యాలయంలో చెల్లించకుండా టీఎల్‌ఎఫ్ గ్రూప్ వద్దనే పెట్టుకున్నట్లు తెలిపారు. అందులో నుంచి రూ.4,94,000లను చెక్కు రూపంలో గురునాథ్ అనే మేస్త్రీ అకౌంట్‌లోకి గుట్టుచప్పుడు కాకుండా ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్, జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీనిపై కనీసం విచారణ కూడా చేయలేదని మండిపడ్డారు. పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేయకపోతే కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సిద్ధగిరి సురేష్, హైకోర్టు న్యాయవాది, బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపకుడు శివరామకృష్ణ, ఎస్సీ, ఎస్టీ, మానిటరింగ్ కమిటీ సభ్యుడు రామాంజి, కార్మిక సంఘం యూనియన్ అధ్యక్షుడు ముత్యాలప్ప, ఈరప్ప, వెంకటేష్, ఫిలిప్, లలితమ్మ, లక్ష్మమ్మ, కమలమ్మ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధే లక్ష్యం

అమరాపురం: మండల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు పని చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. మండలంలోని గ్రామాల్లో వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. మండల అభివృద్ధిపై ప్రణాళిక తయారీ, చేపట్టిన పనుల ప్రగతి, నిధుల తదితర వాటిపై అధికారులతో చర్చించారు. గ్రామాల్లో చేపట్టిన పనుల్లో పారదర్శకత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మెళవాయిలో కార్డెన్ సెర్చ్



మాట్లాడుతున్న సీఐ నగేష్ బాబు

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి పంచాయతీ కేంద్రంలో శనివారం ఉదయం సీఐ నగేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో పర్యటించి పలు చోట్ల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మాట్కా, జూదం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. నాటుసారా, కర్ణాటక మద్యాన్ని ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైదుగోళంలో..

లేపాక్షి: మండలంలోని మైదుగోళంలో శనివారం హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అక్రమ కర్ణాటక మద్యం, ఇసుక, మట్టి, పేకాట, దొంగతనాలు, అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలు, గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరేంద్ర, పోలీసులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో ఆర్డీటీ కోచ్ సల్మాన్ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి ప్రారంభమైన క్రికెట్ టోర్నీ శనివారం ముగిసింది. బాలుర విభాగంలో మొత్తం 18 జట్లు, బాలికల విభాగంలో 8, మిక్స్‌డ్ జెండర్‌లో 6 జట్లు టోర్నీలో పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో డీవీడీబీఎస్ చిన్మయ విద్యాలయ, లయోలా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలు తలపడ్డాయి. చిన్మయ విద్యాలయ విజేతగా నిలిచింది. బాలికల మ్యాచ్‌లో వాసవీ విన్నర్స్, ఎల్‌ఆర్‌జీ పాఠశాల జట్లు ఫైనల్స్‌కు చేరుకోగా.. వాసవీ విన్నర్స్ జట్టు విజయం సాధించింది. మిక్స్‌డ్ జెండర్‌లో మనస్వి, ఎల్‌ఆర్‌జీ పాఠశాలలు ఫైనల్‌లో తలపడ్డాయి. మనస్వి పాఠశాల గెలుపొందింది. బెస్ట్ బాట్స్‌మెన్‌గా తేజేశ్వర్, బౌలర్‌గా సతనిక్‌వేల్ నిలిచారు. ఆర్డీటీ కోచ్ సల్మాన్ మాట్లాడుతూ.. క్రికెట్ నేర్చుకోవాలన్న వారికి ఎంజీఎం క్రీడా మైదానంలో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు 8328182794 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. గెలుపొందిన జట్లకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ఎంజీఎం పాఠశాల ఉపాధ్యాయుడు అమర్నాథ్, చిన్మయ విద్యాలయ ప్రిన్సిపాల్ సరళ, మహేష్ బాబు, చంద్రశేఖర్ యాదవ్, సీనియర్ క్రీడాకారుడు రఘు, సపోర్ట్ యూత్ లీడర్స్ మహిత, యహ్యా, వ్యాయామ ఉపాధ్యాయులు విజయ భాస్కర్ రెడ్డి, మారుతి, తదితరులు పాల్గొన్నారు.